క్లుప్తంగా

మా నమ్మకం నువ్వే జగనన్న



నాదెండ్ల: సంక్షేమ పథకాల అమల్లో ఆంధ్రప్రదేశ్ అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని చిలకలూరిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు చెప్పారు. గణపవరం రాజీవ్ గాంధీ కాలనీ చవిటిపాలెంలో శుక్రవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. గృహ సారథులు, వలంటీర్లు, కన్వీనర్లతో కలిసి ఇంటింటికీ తిరిగి నాలుగేళ్ళలో ముఖ్యమంత్రి చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని గురించి వివరించారు. గృహ యజమానుల అనుమతితో జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్‌ను అంటించారు. ప్రజలు తమకు అందిన సంక్షేమ పథకాలపై సంతోషం వ్యక్తం చేశారు.

షేడ్‌నెట్‌ల పరిశీలన

ఈపూరు : మండలంలోని షేడ్ నెట్ నర్సరీలను నరసరావుపేట ఉద్యాన శాఖ అధికారి దాసరి నవీన్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మిరప ధరలు ఆశాజనకంగా ఉండటంతో అధికంగా రైతులు ఆ పంట వైపు మొగ్గుచూపుతున్నారని వివరించారు. అందుకే నాణ్యమైన నారును అందించే ఉద్దేశంతో నర్సరీల యాజమాన్యాలకు సలహాలు, సూచనలు ఇస్తున్నట్లు వెల్లడించారు. నర్సరీల యాజమాన్యాలు తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవాలని, ఇప్పటికే ఉన్న వారు రెన్యూవల్ చేసుకోవాలని చెప్పారు. ఆర్బీకేల ద్వారా కూడా రైతులకు విత్తనాలు అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఇనిమెళ్ల ఉద్యాన సహాయకులు పి.ఏలియా, షేడ్ నెట్ నర్సరీ యాజమాన్యం, రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గేదెలు మృతి

బొల్లాపల్లి : ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై రెండు గేదెలు మృతి చెందిన ఘటన మన్నేపల్లి తండా పొలాల్లో జరిగింది. తండాకు చెందిన రామావత్ హనుమానాయక్, పెదమన్నెయ్యలకు చెందిన గేదెలు విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై మృతి చెందాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మేతకు వెళ్లిన పశువులు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయని, ఒక్కొక్క గేదె విలువ రూ.40 వేలు ఉంటుందని బాధితులు తెలిపారు.

ఎలుకల మందు తిని కార్మికుడు మృతి

యడ్లపాడు: అనారోగ్య కారణాలతో నూలు మిల్లు కార్మికుడు ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించాడు. విషయం తెలిసి బంధువులు కాకినాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన నాగం శ్రీను(35) కొద్ది కాలం కిందట మండలంలోని తిమ్మాపురం పరిధిలోని ఓ నూలు మిల్లులో కార్మికుడిగా చేరాడు. మిల్లు క్వార్టర్స్‌లోనే నివాసం ఉంటున్న అతనికి ఇటీవల అనారోగ్య సమస్యలు తలెత్తాయి. దీంతో ఈనెల 18న క్వార్టర్స్‌లోని తన గదిలో ఎలుకలు మందు తిన్నాడు. ఆరోగ్యం విషమించడంతో మరుసటి రోజు కాకినాడలోని అతని బంధువులకు ఫోన్ చేసి చెప్పాడు. 20న మిల్లు వద్దకు వచ్చిన బంధువులు శ్రీనును కాకినాడ ఆస్పత్రికి తరలించారు. చికిత్స సమయంలో అతను ఎలుకల మందు తిన్న విషయం వైద్యులు వెల్లడించారు. పరిస్థితి విషయమించి అతను మృతి చెందాడు. మృతిని మేనల్లుడు ఎస్వీ గంగాధర రంగారావు ఫిర్యాదు మేరకు యడ్లపాడు ఎస్ఐ పైడి రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం నరసరావుపేట మండలం యక్కలవారిపాలెంకు చెందిన గుండ్లతోటి డేవిడ్‌రాజు (26) పొలం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. గురువారం రాత్రి 11 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై నరసరావుపేట నుంచి కోటప్పకొండమీదుగా చిలకలూరిపేటకు వస్తుండగా మద్దిరాల గ్రామ ప్రారంభంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. డేవిడ్ రాజు ఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి తండ్రి గిరిబాబు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిరుమామిళ్లలో గ్రామోదయం

నాదెండ్ల: చిరుమామిళ్ళలో అధికారులు గ్రామోదయం కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి బీజే బెన్ని, ఎంపీడీఓ జాకీర్‌హుస్సేన్, సర్పంచ్ సింగారెడ్డి లక్ష్మీ, నాదెండ్ల పీఏసీఎస్ చైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డి హాజరయ్యారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మనబడి నాడు-నేడు పనులను పరిశీలించారు. క్లాప్ మిత్రలతో సమావేశమయ్యారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారులతో మాట్లాడారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించి వైద్యాధికారి సాయిశ్వేతతో మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ రమణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యతేజ, ఏపీఎం భరత్, ఎంఈఓ ఆంజనేయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జన జీవితాల్లో జగనన్న వెలుగులు

- అందరికీ విద్యా, వైద్యం, గృహాలు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: జన జీవితాల్లో వెలుగులు నింపేలా విప్లవాత్మక సంస్కరణలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండలంలోని మురికిపూడి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మంత్రి విడదల రజిని మాట్లాడుతూ జనం కష్టాలు తెలిసిన ప్రభుత్వం తమదని చెప్పారు. పేదలందరికీ నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందేలా తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తెచ్చిందని వివరించారు. ఏ కుటుంబమైనా అభివృద్ధి చెందాలంటే ఆ ఇంటిలోని భావిపౌరులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన అవసరం ఉందన్నారు. అందు కోసం ముఖ్యమంత్రి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ఇంగ్లిషు మీడియం, జగనన్న విద్యాకానుక, విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద వంటి ఎన్నో పథకాలతో పేద విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్నారని వివరించారు. దీనికి తోడు వైద్య రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చినట్లు వెల్లడించారు. ఆరోగ్యశ్రీని దాదాపు అన్ని వ్యాధులకు వర్తింపజేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. రూ. 16 వేల కోట్లతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నుంచి మెడికల్ కళాశాలల వరకు నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరి సొంతింటి కల నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం అందరికీ ఇళ్లు, జగనన్న కాలనీలు నిర్మిస్తోందని వివరించారు. ప్రజా సంక్షేమం కోసం ఎంతో చేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, గ్రామ సర్పంచ్ ఉసర్తి భూలక్ష్మి, ఉప సర్పంచ్ కొమ్మనబోయిన రామకృష్ణరాజు, వైస్ ఎంపీపీ సూరబోయిన ఆదిలక్ష్మి, మురికిపూడి పీఏసీఎస్ అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటశివ, ఎంపీటీసీ సభ్యులు జమ్మలమడక సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉసర్తి రాంబాబు,కొమ్మనబోయిన చెంచురాములు, బోడి సాంబయ్య, గోగు ముక్కంటి, దాసరి హనుమంతరావు, జాష్టి సూరయ్య పాల్గొన్నారు.

రూ.26 కోట్ల స్త్రీనిధి రుణాలు లక్ష్యం

శావల్యాపురం: 2023-24 ఆర్థిక సంవత్సరంలో వినుకొండ నియోజకవర్గంలో రూ.26 కోట్ల మేర స్త్రీనిధి రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్త్రీనిధి మేనేజర్ రంతు చినబుల్లెయ్య చెప్పారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఐదు మండలాల్లో 5,200 మంది మహిళా సభ్యులకు ఈ రుణాలు అందజేస్తామని వివరించారు. ఒక్కో గ్రూపునకు రూ.4 లక్షలు మంజూరు చేస్తామని వెల్లడించారు.

27న బహిరంగ వేలం

చిలకలూరిపేటటౌన్: మండలంలోని రాజాపేట గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలో పాత ఇనుము, అల్యూమినియం, స్టీల్, ప్లాస్టిక్ వస్తువులను బహిరంగ వేలం వేయనున్నట్లు ప్రిన్సిపాల్ డి.ఉషారాణి చెప్పారు. ఈనెల 27న బహిరంగ వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ప్రిన్సిపాల్, ఏపీఆర్ స్కూల్, చిలకలూరిపేట పేరు మీద స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రూ. 5 వేల డీడీని తీసి పాఠశాల యాజమాన్యానికి జమచేయాలని చెప్పారు. ఇతర వివరాలకు 83095 59767ను సంప్రదించాలని పేర్కొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా మేదరమెట్ల



గెలిచిన కార్యవర్గ సభ్యులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎన్నికల కమిటీ చైర్మన్, సభ్యులు

నరసరావుపేట: స్థానిక న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్షునిగా మేదరమెట్ల నాగేశ్వరరావు విజయం సాధించారు. కోర్టు ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు ఉత్కంఠగా సాగాయి. అసోసియేషన్‌లో మొత్తం 286 మంది ఓటర్లు ఉండగా, సాయంత్రం నాలుగు గంటల్లోపు 246 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ అనంతరం ఎన్నికల కమిటీ చైర్మన్ ఎస్.అయ్యపరాజు, సభ్యులు కట్టా నారపరెడ్డి, సీజే ప్రతాప్, అలెగ్జాండర్ సుధాకర్ నాగరాజు, షంషేర్‌ఆలీలు కౌంటింగ్ నిర్వహించారు. అధ్యక్ష పదవికి గాలి జయప్రకాష్, మేదరమెట్ల నాగేశ్వరరావు పోటీపడగా నాగేశ్వరరావుకు 148 ఓట్లు రాగా జయప్రకాష్‌కు 96 ఓట్లు వచ్చాయి. 52 ఓట్ల మెజార్టీతో నాగేశ్వరరావు విజయం సాధించారు. ఉపాధ్యక్ష పదవికి ఇద్దరు మహిళా న్యాయవాదులు పోటీ పడగా నసీమా బేగంపై అమూల్య భారీ మెజార్టీతో గెలిచారు. అమూల్యకు 197 ఓట్లు రాగా నసీమాకు 46 మాత్రమే వచ్చాయి. ప్రధాన కార్యదర్శి పదవికి శ్రీరామినేని ప్రసాదుపై అబ్బూరి ఏడుకొండలు 28 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఏడుకొండలుకు 135 ఓట్లు రాగా 107 ఓట్లు ప్రసాదుకు వచ్చాయి. కోశాధికారి, సంయుక్త కార్యదర్శి పదవులకు సునీల్‌సింగ్, వి.సాంబశివరావు ఒక్కొక్కరే నామినేషన్ వేయడంతో వారు ఏకగ్రీవమయ్యారు.

మసీదుల్లో ఎమ్మెల్యే ప్రార్థనలు



నాలుగో వార్డులోని మసీదులో మౌజమ్‌లకు కొత్త దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి



రొంపిచర్లలో ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట / రొంపిచర్ల: రంజాన్ మాసం సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పట్టణంలోని పలు మసీదులను సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లింలకు ఇఫ్తార్ విందును వడ్డించారు. రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. గురువారం సాయంత్రం పట్టణంలోని నాలుగో వార్డు డాక్టర్ కారసాని హాస్పిటల్ వెనుక బజారులోని 'హుస్సేన్ మస్జిద్' పెద్దల ఆహ్వానం మేరకు ఆ మసీదును సందర్శించారు. ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. మౌజమ్, పేష్‌మామ్‌లకు కొత్త దుస్తులు అందజేశారు. మసీదు అభివృద్ధికి సహాయం అందజేస్తామన్నారు. 34వ వార్డు సత్తెనపల్లి రోడ్డులోని సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న 'కౌసర్ మస్జిద్ 'కమిటీ ఆహ్వానం మేరకు మగ్రిబ్ నమాజ్ అనంతరం ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కోటప్పకొండ రోడ్డులోని ఆర్టీవో ఆఫీస్ ఎదురు కేఎస్పీ కాలనీలోని మసీదును సందర్శించి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషా బేగం ఖాజావలి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్.ఎ. హనీఫ్, నియోజకవర్గ, పట్టణ మైనార్టీసెల్ అధ్యక్షులు షేక్ ఖాదర్‌బాషా, షేక్ మహబూబుబాషా, మాజీ కౌన్సిలర్ షేక్ మంజూరు పాల్గొన్నారు.

– రొంపిచర్లలో వైఎస్సార్ సీపీ నాయకుడు చపారపు గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు మత పెద్దలతో కలిసి మసీదులో ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేను ముస్లింలు సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పిల్లి ఓబుల్ రెడ్డి, చపారపు గోపాల్‌రెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, గడ్డం వెంకట్రావు, వైఎస్సార్‌సీపీ యువజన జిల్లా విభాగం అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, ప్రచారం విభాగం అధ్యక్షుడు గానుగపంట ఉత్తమరెడ్డి, గెల్లి సుబ్బారెడ్డి, గెల్లి కోటిరెడ్డి, గుండాల వెంకటేష్, తన్నీరు శ్రీనివాసరావు, వద్దుల సుబ్బారెడ్డి, మానుకొండ వాసుదేవరెడ్డి, కల్లం శివారెడ్డి, కల్లి పిచ్చిరెడ్డి, వీఆర్వో పడాల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రంజాన్ ప్రార్థనలకు సర్వంసిద్ధం



చిలకలూరిపేట ఈద్గా మైదానంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

యడ్లపాడు/చిలకలూరిపేట: పవిత్ర రంజాన్ మాసం పూర్తయింది. ముస్లింలు గతనెల 24న ప్రారంభించిన రోజా (ఉపవాసం) దీక్షలు శుక్రవారంతో ముగిశాయి. సాయంత్రం నెలవంక కోసం మసీదుల వద్ద ముస్లింలు గంటలకొద్ది సమయం వేచి చూశారు. పొగమంచు వల్ల చంద్రదర్శనం కాలేదు. అయినా రాష్ట్రస్థాయి మతపెద్దల నుంచి వచ్చిన సమాచారంతో శనివారం ఈదుల్ ఫితర్ (రంజాన్) పండగను జరుపుకోవాలంటూ ఇషా నమాజ్ సమయంలో ప్రకటించారు. దీంతో ముస్లిం వాడల్లో సందడి మొదలైంది. రాత్రి నుంచే షాపింగ్ హడావిడి కనిపించింది. ఉపవాస దీక్షలు ముగియడంతో ఇఫ్తార్ విందులు భారీగా జరిగాయి. రంజాన్ ప్రార్థనల కోసం మసీదులు, ఈద్గాలు సుందరంగా ముస్తాబయ్యాయి. చిలకలూరిపేట అడ్డరోడ్డు సెంటర్‌లో ఈద్గా మైదానం వద్ద ఏర్పాట్లను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని పరిశీలించారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో ట్యాంకర్లు తీసుకొచ్చి ఈద్గా ప్రాంతాన్ని శుభ్రం చేయించారు.

వేసవిలో నీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎంపీపీ బత్తిరాములు

బొల్లాపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం ఇన్‌చార్జి ఎంపీడీవో టి.పార్వతి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. మండలంలోని ప్రధాన సమస్యలపై చర్చించారు. వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ బత్తి రాములు మాట్లాడుతూ మండల అభివృద్ధికి అధికారులు పాటుపడాలని సూచించారు. జెడ్పీటీసీ ఆర్.బీక్లీబాయి మాట్లాడుతూ తాగునీటి సమస్యపై గతంలో పలుమార్లు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ సమావేశంలోనూ, అసెంబ్లీలోనూ ప్రస్తావించినట్టు గుర్తుచేశారు. ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. వరికపూడిశెల సాధించేలా ప్రజాప్రతినిధులు ముందుకు సాగాలన్నారు. జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ డి.గోవిందునాయక్ మాట్లాడుతూ నీటి సమస్యపై దృష్టి పెట్టాలని కోరారు. అనంతరం సమావేశానికి గైర్హాజరైన అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని, వరికపూడిశెల సాధనకు కృషి చేయాలని సభ్యులు తీర్మానం చేశారు. రూ.1.22కోట్ల 15వ ఆర్థికసంఘం నిధులు, రూ.27లక్షల సాధారణ నిధుల జమ ఖర్చులపై అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు టి.కోటిరెడ్డి, బి.మరియమ్మ, తహసీల్దార్ వి.సుధాకర్‌శర్మ, బత్తి గురవయ్య, కోఆప్షన్ మెంబరు షేక్ మౌలాలి పాల్గొన్నారు.

పందుల విక్రయాలపై విచారణ

వినుకొండ(నూజెండ్ల) : వినుకొండ మున్సిపల్ అధికారులు పందులను అమ్ముకున్నారన్న ఫిర్యాదుపై పులిచింతల ప్రాజెక్టు డెప్యూటీ కలెక్టర్ సి.శ్రీరాములు వినుకొండ తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం విచారణ చేపట్టారు. అధికారులు తమ పందులను అమ్ముకున్నారని కొద్దిరోజుల క్రితం పెంపకందారులు దార్ల కోటేశ్వరరావు, మరికొందరు బాధితులు రాష్ట్ర గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. గవర్నర్ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాలతో కలెక్టర్ శివశంకర్ డెప్యూటీ కలెక్టర్ సి.శ్రీరాములును విచారణాధికారిగా నియమించారు. దీంతో డెప్యూటీ కలెక్టర్ శ్రీరాములు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి బాధితులను, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులును పిలిపించి మాట్లాడారు. సాయంత్రం పందుల పెంపకం ప్రాంతమైన చెక్కవాగు వద్దకు వెళ్లి పరిశీలించారు. బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టామని, వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని డెప్యూటీ కలెక్టర్ శ్రీరాములు తెలిపారు. నాలుగు నెలల క్రితం తమకు చెందిన 400 పందులను తీసుకెళ్లి మున్సిపల్ అధికారులు అమ్ముకున్నారని బాధితులు వివరించారు. విచారణలో వినుకొండ తహసీల్దార్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

తెలుగు బాపిస్ట్ చర్చి వార్షికోత్సవం

నాదెండ్ల: గణపవరం అంబేడ్కర్ కాలనీలోని తెలుగు బాపిస్ట్ చర్చి తొలి వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. స్థానిక చర్చి పాస్టర్ చిలకా ప్రభుసింగ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్చి నిర్మాణానికి సహకరించిన దాతలను అభినందించారు. భారీ అన్నదానం నిర్వహించారు. చర్చిని విద్యుద్దీపాలతో అలంకరించారు. చిన్నారులు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమాలను సంఘ పెద్దలు పర్యవేక్షించారు.

పనిచేసేవ్యవస్థ



ఈకేవైసీకి వేలిముద్రలు సేకరిస్తున్న సిబ్బంది

వినుకొండ(నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిళ్లలోకే సత్వర సేవలు అందుతున్నాయి. దీనికి ఈ ఘటనే నిదర్శనం. నూజెండ్ల మండలం ఉప్పలపాడుకు చెందిన ముక్కాముల శివనాగిరెడ్డి ఏడాది క్రితం పక్షవాతానికి గురై మంచంలో కదల్లేని స్థితిలో ఉన్నాడు. పెన్షన్‌కు అర్హత ఉన్నా అతని ఆధార్‌కు వేలిముద్రలు, ఫోన్ నంబరు లింక్ కాకపోవడంతో సమస్య ఉత్పన్నమైంది. దీనిపై అతడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. తక్షణం స్పందించిన పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ వెంటనే బాధితుని వద్దకు వెళ్లి ఆధార్ ఈ-కేవైసీ చేయాలని వినుకొండ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఆ ఆదేశాలతో వినుకొండ లాయర్స్‌స్ట్రీట్ -1 సచివాలయం సిబ్బంది కోటేశ్వరరావు, మహేశ్వరి వెనువెంటనే బాధితుని వద్దకు వెళ్లి వేలిముద్రలు సేకరించి ఈ-కేవైసీ పూర్తి చేశారు. బాధితుడికి పెన్షన్ వచ్చేలా చర్యలు తీసుకున్నారు. దీంతో శివనాగిరెడ్డి ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. సచివాలయ సిబ్బంది, ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపాడు.

ఆపరేషన్ చేస్తుండగా వ్యక్తి మృతి

పెనమలూరు: పోరంకిలో ఓ వ్యక్తికి గొంతు ఆపరేషన్ చేస్తుండగా అతని పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన సమాచారం, మృతుడి భార్య మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం మానుకొండవారిపాలెంకు చెందిన డి.మరియమ్మ, దేవదాసు(40) భార్యాభర్తలు. వ్యవసాయ కూలీలు. దేవదాసుకు పది రోజుల క్రితం గొంతు వద్ద గడ్డ వచ్చింది. చిలకలూరిపేటలో వైద్య పరీక్షలు చేయించుకోగా ఆపరేషన్ చేయాలని అక్కడ ఉన్న పోరంకికి చెందిన వైద్యుడు బుగ్గా కృపాలిన్ తెలిపాడు. పోరంకిలోని అమృత ఈఎన్‌టీ ఆస్పత్రికి రావాలని సూచించాడు. దేవదాసు గురువారం ఉదయం పోరంకి ఆస్పత్రిలో చేరాడు. అదేరోజు రాత్రి ఆపరేషన్ మొదలు పెట్టిన తరువాత దేవదాసుకు ఆక్సిజన్ అందటం లేదని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే దేవదాసు మృతి చెందాడని అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. ఘటనపై మృతుడి భార్య మరియమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. న్యాయం చేయాలని కోరింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రధానోపాధ్యాయుల సమావేశం

రొంపిచర్ల: స్థానిక బీసీ కాలనీలోని మండల విద్యా వనరుల కేంద్రంలో శుక్రవారం ఎంఈఓ అధ్యక్షతన ప్రధానోపాధ్యాయులకు సోషల్ ఆడిట్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ కె.పి.బాబురెడ్డి మాట్లాడుతూ మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల పేరెంట్స్ కమిటీ సభ్యులకు ఈ నెల 24 నుంచి 29 వరకు సోషల్ ఆడిట్‌పై శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ సభ్యులు అందరూ హాజరయ్యేలా ప్రధానోపాధ్యాయులు వారిని ప్రోత్సహించాలని చెప్పారు. అనంతరం ప్రధానోపాధ్యాయులకు సోషల్ ఆడిట్‌పై శిక్షణ జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి పెరవలి రవితేజ, ఎం.శారద రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎం.ఆర్.సి పచ్చవ రామకృష్ణ, మస్తాన్, పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నాటికళా వైభవం.. విశ్వవిద్యాలయం

- సినీనటుడు డాక్టర్ చిట్టినేని లక్ష్మీనారాయణ
- లింగారావుపాలెంలో ప్రారంభమైన నాటికల పోటీలు
- తొలిరోజు మూడు సందేశాత్మక ప్రదర్శనలు



నాటికల ప్రదర్శనను జ్యోతిప్రజ్వలనతో ప్రారంభిస్తున్న సినీ నటుడు చిట్టినేని లక్ష్మీనారాయణ

యడ్లపాడు: మన పూర్వీకులకు నాటక రంగం అన్నది ఓ విశ్వవిద్యాలయం అని సినీ నటుడు డాక్టర్ చిట్టినేని లక్ష్మీనారాయణ చెప్పారు. లింగారావుపాలెంలో శుక్రవారం జరిగిన కొండవీటి కళా పరిషత్ 24వ జాతీయస్థాయి ఆహ్వాన నాటికల పోటీల ప్రారంభోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గుంటూరు కళాపరిషత్ ఆలోకం పెద్దబ్బాయి జ్యోతిప్రజ్వలన చేయగా, గ్రామ సర్పంచ్ షేక్ కరీమున్ నటరాజ పూజ చేసి తొలిరోజు పోటీలను ప్రారంభించారు. అనంతరం చిట్టినేనిని సత్కరించారు. చిట్టినేని మాట్లాడుతూ జాతిని మేల్కొల్పేది.. మనిషిని చైతన్యవంతం చేసేది కళారంగమని పేర్కొన్నారు. పరిషత్ అధ్యక్షులు కట్టా శ్రీహరిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ కళాపరిషత్ గుదే పాండురంగా రావు, యడ్లపాడు తహసీల్దార్ ఎన్.నాగమల్లేశ్వరరావు, పరిషత్ సభ్యులు సంబూరు కృష్ణారావు, దండా వీరాంజనేయులు పాల్గొన్నారు. అనంతరం నాటికల పోటీలు ప్రారంభమయ్యాయి.

మానవ జీవనంలో మిగిలే 'ఆస్తికలు'..

జీవకోటిలో ఎంతో మేధస్సు కలిగిన మనిషి ఆస్తుల సముపార్జన.. సంపాదనే జీవితం అనుకుంటూ ప్రకృతి విరుద్ధమైన విపరీత ధోరణితో జీవనం సాగిస్తున్నాడని ఓ కుటుంబంలో చెలరేగే అలజడుల ద్వారా సందేశాత్మకంగా చెప్పిన ప్రదర్శన 'ఆస్తికలు' నాటిక. నాయుడు గోపీ దర్శకత్వం వహించిన ఈ నాటికకు మృత్యుంజయరావు రచయిత. గంగోత్రి (పెదకాకాని) సంస్థ కళాకారులు ప్రదర్శించారు.

కుచితాలోచనలకు 'కాపలా' ఎలా..

వ్యక్తులకు, వ్యవస్థలకు కాదు కంటి పాపకు.. కుచితమైపోతున్న మేధస్సుకు రక్షణ కావాలని ఆలోచింపజేసే ఇతివృత్తమే 'కాపలా' నాటిక. వ్యవస్థలకు, వ్యక్తులకు కాపలా పెట్టినా ఆగని నేరాలు, ఘోరాల నియంత్రణ కుటుంబ వ్యవస్థ మార్పుతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేసే ఈ నాటికను రసఝరి (పొన్నూరు) సంస్థ కళాకారులు ప్రదర్శించారు. వై.భాస్కరరావు రచించిన ఈ నాటికకు వైఎస్ కృష్ణేశ్వరరావు దర్శకత్వం వహించారు. చివరిగా 'నాన్నా నేనొచ్చేస్తా' నాటికను ప్రదర్శించారు. గుంటి రాజేశ్వరి మూలకథకు తాళ్లబత్తుల వెంకటేశ్వరరావు నాటకీకరణ చేసి అమృతలహరి దర్శకత్వంలో అమృతలహరి థియేటర్స్ ఆర్ట్స్ (గుంటూరు) సంస్థ కళాకారులతో ప్రదర్శింపజేశారు.


గణపవరంలో మే 31న రామాలయ ప్రతిష్ఠ

నాదెండ్ల: గణపవరం గ్రామంలో రూ.2 కోట్లతో నిర్మించిన రామాలయాన్ని శుక్రవారం టీటీడీ వేద పాఠశాల అధ్యాపకులు మాల్యావంతు శ్రీనివాస దీక్షితులు సందర్శించారు. ఈ ఏడాది మే 31న ఆలయంలో విగ్రహ, ధ్వజస్తంభ, కలశ ప్రతిష్ఠా మహోత్సవం జరగనుంది. శ్రీనివాస దీక్షితులు ఆలయం ప్రతిష్ఠకు శుభముహూర్తాన్ని నిర్ణయించి లగ్నపత్రికను కమిటీ సభ్యులకు అందించారు. మే 27న ఉదయం 7.26 గంటలకు విగ్రహ పూజలు ప్రారంభించాలని, 31న ప్రతిష్ఠ జరపాలని నిర్ణయించారు. ప్రతిష్ఠా మహోత్సవానికి శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి హాజరు కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఐదు రోజులపాటు జరిగే పూజా కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. శాంతి హోమాలు జరిగే ప్రదేశాన్ని దీక్షితులు పరిశీలించారు. పూర్తి రాతితో నిర్మించిన ఆలయ నిర్మాణం, వాస్తును చూసి కమిటీ సభ్యులను అభినందించారు. ప్రతిష్ఠా మహోత్సవం రోజున సుమారు 50 వేల మందికి అన్నదానం చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. దీక్షితులతోపాటు భారతి ధార్మిక విజ్ఞాన పరిషత్ కన్వీనర్ బొల్లేపల్లి సత్యనారాయణ, చినజీయర్‌స్వామి శిష్యులు కూర్మానాదస్వామి, ధనలక్ష్మీ గ్రూప్‌ఆఫ్ ఇండస్ట్రీస్ కార్యదర్శి పేర్ని వీరనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం హాజరైన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వస్తువుల వితరణ

రొంపిచర్ల: వడ్లమూడివారిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రానికి రూ.10 వేల విలువ చేసే వస్తువులను గ్రామానికి చెందిన దాసరి యోహాన్ శుక్రవారం బహూకరించారు. ఒక టేబుల్, ఆరు కుర్చీలు, ఒక ఇనుప ర్యాక్, 15 గ్లాసులు, స్పూన్స్, 30 ప్లేట్లు, 15 గిన్నెలను అందించారు. యోహాన్‌ను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దేవీబాయి, గ్రామస్తులు అభినందించారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అధిగమిద్దాం



అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి లోతేటి వరలక్ష్మి

శావల్యాపురం: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను అధిగమించడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి లోతేటి వరలక్ష్మి చెప్పారు. శుక్రవారం గ్రామోదయం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుంటుపాలెం గ్రామ సచివాలయాన్ని ఆమె సందర్శించారు. సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. అనంతరం భాస్కర్‌నగర్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు, పంచాయతీ కార్యదర్శి చింతా శ్రీనివాసరావు పాల్గొన్నారు.